క్లుప్తంగా

దీక్షా స్వాముల రక్తదానం



రక్తదానం చేస్తున్న దీక్షాపరులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సుబ్రమణ్యస్వామి షష్టిని పురస్కరించుకొని గురుస్వామి సురేష్ ఆధ్వర్యంలో గురువారం సుబ్రమణ్యస్వామి మాలాదారులు 25 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సురేష్, రవీంద్రనాథ్ నంద్యాల బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వ్యక్తులకు గర్భిణులకు రక్తం చాలా అవసరమవుతుందని వారు అన్నారు. కార్యక్రమంలో నంద్యాల బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ అచ్యూత్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధుల కల్పనపై దృష్టి సారించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): పొదుపు సంఘాల మహిళలకు జీవనోపాధులు కల్పించడంపై దృష్టి సారించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం జీవనోపాధులు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏపీఎస్, ఏపీఎంతో పాటు వెలుగు సిబ్బంది, డ్వామా, ఎల్‌సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, ఎస్‌హెచ్‌జీ గ్రౌండింగ్, మొబైల్ బుకింగ్, శ్రీనిధి, ఉన్నతి రికవరీలపై చర్చించారు. తరచుగా సంఘాలు పని చేసే విధంగా చూడాలన్నారు. మహిళలు వారి జీవనోపాధుల ద్వారా అభివృద్ధి చెందేందుకు పాటు పడాలన్నారు. సమావేశంలో ఏపీఎం ఎల్లయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

ఉయ్యాలవాడ : ఈ నెల 9,10, 23, 24 తేదీల్లో మండలంలో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు బీఎల్‌ఓలకు సూచించారు.స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే యువతి, యువకులు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు దరఖాస్తులు పొందవచ్చునని తెలిపారు.

అభ్యంతరాలు ఉంటే 12లోగా ఫిర్యాదు చేయండి

నంద్యాల(అర్బన్): జిల్లా వన్‌స్టాప్ సెంటర్‌లో ఖాళీల భర్తీ కోసం అర్హుల జాబితా జిల్లా వెబ్‌సైట్ http://nandyal.ap.gov.in// ఉందని, వాటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 12లోపు ఫిర్యాదు చేయాలని జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి, మహిళా సాధికారత అధికారిణి లీలావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధారాలతో నేరుగా కార్యాలయానికి వచ్చి రాత పూర్వకంగా ఫిర్యాదు అందజేయాలన్నారు.

నిలిచిన 108 అంబులెన్స్ సేవలు



ఆగిపోయిన శిరివెళ్ల 108 వాహనం

శిరివెళ్ల: మండలంలో గురువారం నుంచి 108 అంబులెన్స్ సేవలు నిలిచిపోయాయి. 24 గంటలు అందుబాటులో ఉండి ఆపదలో ఉన్న వ్యక్తులను సకాలంలో ఆసుపత్రుల్లో చేర్పించే అంబులెన్స్ డీజిల్ లేక ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం 108 సిబ్బంది వేతనాలు ఇవ్వడం అటుంచితే కనీసం డీజిల్‌కు కూడా డబ్బులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. వివిధ గ్రామాల నుంచి వైద్యం కోసం ప్రజలు 108కు కాల్ చేయగా సిబ్బంది నుంచి వాహనం బ్రేక్ డౌన్ అనే సమాధానం రావడంతో ప్రైవేట్ వాహనాల ద్వారా రోగులను ఆసుపత్రుల్లో చేర్పించాల్సి వచ్చింది. సిబ్బందికి నాలుగు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని 108 సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

కన్నీటి దిగుబడులు

- వరిపంటపై తుపాను తీవ్ర ప్రభావం
- భారీగా తగ్గిన దిగుబడులు
- ఆందోళనలో రైతన్నలు



నర్సాపురం సమీపంలో యంత్రాలతో వరికోత దృశ్యం



దిగుబడిని రోడ్డుపై ఆరబెడుతున్న రైతులు

సాగునీటి వనరుల కింద సాగు చేసిన వరిపంట చేతికి వచ్చింది. దీంతో రైతులు పంట కోతలు ప్రారంభించారు. రుద్రవరం మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో 4,980 హెక్టార్లలో వరి సాగు చేశారు. ప్రారంభం నుంచి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటకు గత నెలలో తుపాను ప్రభావంతో కురిసిన వానలు తీవ్ర నష్ట పరిచాయి. దీంతో దిగుబడులు భారీగా తగ్గాయి. ఎకరా 45 బస్తాలకు పైగా రావాల్సి ఉండగా 30 బస్తాలకే పడి పోయింది. దీనికితోడు బస్తా వరి ధాన్యం రూ.1500 పలుకుతుండటంతో వచ్చే సొమ్ము పెట్టుబడులకే సరిపోతోందని రైతులు వాపోతున్నారు. ఎన్నో ఆశలతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వరిసాగు చేస్తే తమకు చివరకు అప్పులు మిగిలాయని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని నర్సాపురం, చిత్రేనిపల్లె, డి.కొట్టాల, చిన్నకంబలూరు గ్రామ రైతులు కోరుతున్నారు. –రుద్రవరం



ఉయ్యాలవాడలో ట్రాక్టర్ సహాయంతో శనగ విత్తనం వేస్తున్న రైతు

•ఆశలు మొలకెత్తేనా..

ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే అత్యధికంగా ఉయ్యాలవాడ మండలంలో పప్పు శనగ సాగవుతోంది. అకాల వర్షాలతో ఖరీఫ్ పంటలు దెబ్బతినడంతో చాలా మంది రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 14,500 హెక్టార్లు కాగా కొండుపల్లె, ఉయ్యాలవాడ, ఆర్.పాంపల్లె, మాయలూరు, బోడెమ్మనూరు, తుడుమలదిన్నె రూపనగుడి, ఆర్.జంబులదిన్నె, హరివరం గ్రామాల్లో ఇప్పటికే 6,900 హెక్టార్లలో శనగ పంట సాగైంది. మిగిలిన 10 గ్రామాల్లో గత నెల తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దీంతో పొలాల్లో తేమ శాతం అధికంగా ఉండడంతో ఆరుదల కోసం రైతన్నలు ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 15వ తేదీ వరకు విత్తనం వేసుకునేందుకు అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. –ఉయ్యాలవాడ

పోరుబాటకు రైతులు సిద్ధం కావాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మాట తప్పిన మోదీపై రైతులు పోరుబాటకు సిద్ధం కావాలని రైతు కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నంద్యాలలోని భగత్‌సింగ్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, విజయ్‌కుమార్, డేవిడ్ పాల్గొని మాట్లాడారు. రైతులకు ఆందోళన సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని మోదీ ప్రభుత్వం అమలు చేయాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 26న జరిగే దేశ వ్యాప్త నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పంటల బీమా పథకం కౌలు రైతులకు వర్తింపజేయాలని, ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు అమలు చేయాలని, శ్రీశైలం బ్యాక్ వాటర్, వెలుగోడు, అలగనూరు రిజర్వాయర్లు, హంద్రీనీవాలపై ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, వీరన్న, తోటమద్దులు, శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నదీ జలాల వినియోగంలో ప్రభుత్వం విఫలం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాయలసీమ సాగునీటి సమితి సభ్యులు

నంద్యాల(రూరల్): కృష్ణా, తుంగభద్ర నదీ జలాల వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. స్థానికంగా నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రాజెక్ట్‌ల నిర్మాణ, నిర్వహణలో సమతుల్యం లేకపోవడంతో రాయలసీమ కరువు సీమగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాయలసీమ జలసంరక్షణ అవశ్యకతను వివరిస్తూ పుస్తకరూపంలో ముఖ్యమంత్రికి రాసిన విజ్ఞాపన పత్రాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు అందజేశారు. అనంతరం దశరథరామిరెడ్డి మాట్లాడుతూ వంద రోజులుగా నిరంతరాయంగా కృష్ణా, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నా జలాలను సద్వినియోగం చేసుకోలేదన్నారు.. కోస్తా ప్రాంతంలో 30 శాతం భూమికి సాగునీరు లభిస్తుందని, అదే రాయలసీమలో 9 శాతం భూమికి మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. సీమలో అనేక సాగునీటి ప్రాజెక్టులు కేవలం శిలాఫలకాలకు మాత్రమే పరిమితమయ్యాయని, ఆయా ప్రాజెక్ట్‌ల గురించి ముఖ్యమంత్రికి పుస్తకం రూపంలో తెలియజేస్తున్నానన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్ట్‌లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వైఎస్.రెడ్డి, కార్యదర్శి మహేశ్వరరెడ్డి, నాయకులు సుధాకర్‌రావు, సాకేస్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించం

- పొలం పిలుస్తుంది కార్యక్రమాలకు వ్యవసాయ అనుబంధశాఖల అధికారులందరూ హాజరు కావాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ

నంద్యాల(రూరల్): రైతుకు సంబంధించిన విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. ఇక నుంచి పొలం పిలుస్తుంది కార్యక్రమానికి జిల్లాలోని వ్యవసాయ అనుబంధశాఖల అధికారులందరూ తప్పక హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకాని వ్యవసాయ అనుబంధశాఖల అధికారులపై సాక్షి దినపత్రికలో 'పిలిచినా పలకడం లేదు!' అనే శీర్షికతో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఉప వ్యవసాయ సంచాలకులు సరళమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ గురువారం పట్టణంలోని జిల్లా వనరుల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారులతో పాటు సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు . ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ రైతుల పంటల దిగుబడి పెరుగుదలకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. అనంతరం వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు రాధాకుమారి, రాఘుకృష్ణ, వ్యవసాయ అనుబంధశాఖల జిల్లా అధికారులు నరేంద్ర, నాగరాజు, అరుణ్‌కుమార్ తదితరులు తమకు సంబంధించిన విషయాలను క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియపరిచారు. కార్యక్రమంలో ఏడీఏలు రాజశేఖర్, అశోక్, ఆంజనేయులు, విజయశేఖర్, వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

పట్టించుకోకపోతే కూలిపోతుంది!



శిథిలావస్థకు చేరిన సత్రం పైకప్పు భాగం

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో ప్రాచీన కట్టడం నిర్లక్ష్యానికి గురవుతోంది. గ్రామంలో ఎవరైనా యాచకులు లేదా స్థానికులు కూర్చొని సేదతీరేందుకు నాడు సత్రం నిర్మించారు. అయితే, ప్రస్తుతం దీని పైకప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వర్షం కురిసినప్పుడు కారుతుంది. అధికారులు స్పందించి స్లాబ్ వేయించాలని లేకపోతే కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.

అవీ-ఇవీ

హామీలు అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగానికి సంబంధించి మంత్రి నారాలోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు, ఏఐటీయూసీ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ నెం.77ను రద్దు చేసి వసతి దీవెన, విద్యాదీవెన, అమ్మ ఒడి పథకాలు వెంటనే అమలు చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా సంతోష్, తరుణ్‌లతో పాటు 11 మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

9 నుంచి సండే స్కూల్ ట్రైనింగ్ క్యాంపులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 9, 10 తేదీల్లో కోవెలకుంట్ల మండలం కలుగొట్ల గ్రామంలో సండే స్కూల్ ట్రైనింగ్ క్యాంపులు నిర్వహించనున్నట్లు బీసీఎం డైరెక్టర్ యోహాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులకు చుట్టు పక్కల గ్రామాల పిల్లలు హాజరు కావాలన్నారు.

అన్నప్రసాద కేంద్రం తనిఖీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ఇన్‌చార్జ్ ఈఓ ఇ.చంద్రశేఖరరెడ్డి గురువారం అన్నప్రసాద వితరణ విభాగాన్ని తనిఖీ చేశారు. వంటకాలను పరిశీలించారు. అనంతరం అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న పలువురు భక్తులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అన్నప్రసాద వితరణలో వంటకాలన్నీ రుచికరంగా ఉండాలని, వంటకాలలో కూరగాయలను విరివిరిగా వినియోగించాలని సిబ్బందికి సూచించారు. వండిన ప్రతి వంటకం భక్తుడికి అందేవిధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. భక్తులు అధిక సమయం వేచి ఉండకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

దత్తాత్రేయుడికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి గురువారం సందర్భంగా విశేష పూజలను అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

గృహనిర్మాణ బిల్లులు ఇప్పించండి



రుద్రవరంలో ఎంపీడీఓకు సమస్య వివరిస్తున్న పెద్దకంబలూరు లబ్ధిదారులు

రుద్రవరం: గృహ నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించి ఆదుకోవాలని పెద్ద కంబలూరు గ్రామానికి చెందిన నరసింహ, ప్రసాదు, రాంకిట్టు, మధు, మల్లేష్, చక్రపాణి, శ్రీనివాసులు, ఓబులేస్, ప్రతాప్, లాజర్, ఆంజనేయులు, అకిబాబు, ఓబయ్య, బ్రహ్మయ్య తదితరులు గురువారం ఎంపీడీఓ భాగ్యలక్ష్మిని కోరారు. గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రం నర్సిరెడ్డితో కలిసి వారు అక్కడికి వచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలకతీతంగా 70 మంది లబ్ధిదారులకు పక్క గృ హాలు మంజూరయ్యాయని, వారిందరికి ప్రభుత్వం నుంచి దాదాపు రూ. 1.50లక్షల వరకు బిల్లులు అందాయని అన్నారు. అయితే ఉపాధి పథకం ద్వారా బేస్‌మెంట్, బాత్‌రూంల మస్టర్ బిల్లులు ఒక్కొక్కరికి రూ.30 వేలు రావాల్సి ఉందని అన్నారు. స్పందించి బిల్లులు అందేలా చూడాలని కోరారు.

అతిసారం నివారణ చర్యలు ముమ్మరం



రుద్రవరం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న అధికారులు



క్లోరినేషన్ చేసిన నీటిని ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న దృశ్యం

రుద్రవరం: రుద్రవరం ఎస్సీ కాలనీ, చంద్రుని పేటలో పది రోజుల క్రితం అతిసారం ప్రబలడంతో అధికారులు నివారణ చర్యలు ముమ్మరం చేశారు. వైద్యశిబిరాల ఏర్పాటుతో పాటు పారిశుద్ధ్యం , శుద్ధి నీటి సరఫరా పనులు చేపట్టారు. కాలనీల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేకంగా డ్రైనేజి నిర్మాణ పనులు చేపట్టారు. అలాగే ఆ కాలనీల వైపు తాగు నీరు సరఫరా చేసే పాత పైప్‌లైన్ తొలగించి కొత్తగా పైప్‌లైన్ పనులు చేపట్టారు.తాగు నీటిని నేరుగా సరఫరా చేసే చోట ఇన్‌లైన్ క్లోరినేషన్ పనులు చేయించారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సాయిబాబా నగర్ జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తొలగించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని మధ్యాహ్న భోజనం కొనసాగించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కా ర్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సురేష్, సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, పట్టణ అధ్యక్ష కా ర్యదర్శులు సంతోష్,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలి



క్రీడాదుస్తులతో ఎంపీ శబరి

నంద్యాల(న్యూటౌన్): ఫెన్సింగ్ జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి తిరిగి రావాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. గురువారం ఆమె ఫెన్సింగ్ క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేశారు. రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అండర్–14 బాలబాలికల ఫెన్సింగ్ రాష్ట్ర జట్టు ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జమ్ముకాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ శ్రీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

సింధుజాను అభినందించిన ఎంపీ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణానికి చెందిన సింధుజా ఎంఏ చరిత్ర విభాగంలో కర్ణాటక యూనివర్సిటీ 5 గోల్డ్ మెడల్స్ ఇవ్వడంతో గురువారం నంద్యాల ఎంపీ శబరి అభినందించారు. సివిల్స్ చదివి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

చాగలమర్రి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో పండు నిరంజన్, బాలిక విభాగంలో సమీర, మనీషా, అండర్–14 బాలుర విభాగంలో చిన్నహరి, నారపు సింహ, బాలికల విభాగంలో నాగ సంకీర్తన, మల్లిక ఎంపికయ్యారు. ఈనేపథ్యంలో పాఠశాల హెచ్‌ఎం కోటయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ గౌస్ మోహిద్దీన్ గురువారం వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో తిరుపతి, గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ దాదాపీర్, పీఈటీ భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం



ఆలమూరులో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నంద్యాల(న్యూటౌన్): క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రవికృష్ణ, డాక్టర్ మధుసూదనరావు, క్యాన్సర్ వైద్య నిపుణులు ప్రణీత్ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ ఆసుపత్రి పర్యవేక్షణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య సంబంధ విషయాలపై అవగాహన కలిగి ఉంటే తమ ప్రాంతాల ప్రజలకు వివరించడానికి అవకాశం ఉంటుందన్నారు. తర్వాత పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, వైస్ ప్రిన్సిపాల్ శైలజా రాణి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రామలింగారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన కల్పించే కరపత్రాలను విడుదల చేశారు.

క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలి

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరు, నర్సాపురం పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ అమర్నాథ్‌రెడ్డి, బాబు గురువారం క్యాన్సర్‌పై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. తర్వాత వారితో కలిసి ఊరిలో ర్యాలీ నిర్వహించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ముందస్తు క్యాన్సర్ పరీక్ష చేయించుకుంటే రక్షణగా ఉంటుందన్నారు. పొగ తాగటం, గుట్కా నమలడం వంటివి చేయడం వల్ల క్యాన్సర్ సోకే ప్రమాదముందని వెల్లడించారు.

దురాలవాట్లకు దూరంగా ఉండాలి

శిరివెళ్ల: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ కృష్ణమూర్తి అన్నారు. గురువారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చాయా చిత్రాలు ద్వారా వ్యాధి వ్యాప్తి, లక్షణాలను విద్యార్థులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ సమాజానికి వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన గురుతర బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇంద్రావతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.